# బాల వికాసం

# బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

( ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

16



ఆ ఇంట్లోని ఓ గదిలో గోడలాగే ఉన్న ఓ నిలువెత్తు రాతి పలకను పక్కకు నెట్టింది ప్రాచీ. దాని వెనుక లిఫ్టువంటిది కనిపించింది. వాళ్ళిద్దరూ దానిలోపలికి వెళ్ళిన వెంటనే దాని తలుపులు మూసుకున్నాయి. పక్కనా, పైనా ఆధారం కోసం పట్టుకోవడానికి వీలుగా రాడ్లున్నాయి.

"వర్ధన్! జాగ్రత్తగా పట్టుకో. మనం వేగంగా వెల్తాం" అని చెప్పి,"రడీ...వన్,టూ,త్రీ గో" అనగానే అది సర్రున కొంతదూరం కిందకు జారిపోతున్నట్టు వెళ్ళింది. అలా కొంత దూరం వెళ్ళిన తరువాత సమాంతరంగా వెళుతున్నది. దానికి ఉన్న కిటికీల్లోంచి బయటి దృశ్యం కనబడుతున్నది. ఆ సొరంగ మార్గంలో రెండు వైపులా గోడల్లోంచి బయటికి పొడుచుకొని వచ్చిన మొన తేలినట్టున్న రాళ్ళున్నాయి. తగులుతాయేమో అనిపించేలా రకరకాల ఆకారాల్లో, సైజుల్లో ఆ కఠిన శిలలు ఉన్నాయి. ప్రమాదకరంగా, భయంగొల్పేలా కనిపిస్తున్న ఆ రాళ్ళల్లో ఏది తగిలినా తాము ప్రయాణం చేస్తున్న ఈ లిఫ్టు తునా తునకలై పోవడానికి క్షణంపట్టదు. ఎన్నోచోట్ల మెలికలు తిరుగుతూ ఉన్న ఆ సొరంగంలో ఏ ఆధారమూ లేకుండా గాలిలో తేలుతూ, వెళుతున్న ఆ లిఫ్టు సుమారు ఓ అరగంట తరువాత ఓచోట నిదానంగా ఆగింది.

అది ఓ పర్వతం కింద కొన్ని వేల అడుగుల లోతున ఉన్న అతి పెద్ద గుహ. తాము నిలబడ్డ నేల నుంచి చూస్తే దాని పైకప్పు దాదాపు ఓ నలభై అడుగుల ఎత్తున్నట్టు కనబడుతుంది. ఓ ఎకరం వైశాల్యంలో విస్తరించి ఉన్నట్టుందది. నేల సమతలంగా ఉన్నా, పైనా, చుట్టూ అనేక రూపాల్లో బయటకు చొచ్చుకొని వచ్చిన కొండ రాళ్ళు. ప్రకృతి చెక్కిన ఓ భయానక సౌందర్య కళా రూపంలా కనిపిస్తున్నదా పాతాళగుహ. గతంలో తాను చూసిన బెలూం గుహలు గుర్తుకొచ్చాయి బాలవర్ధన్‌కు. కానీ ఇవి అనేక రెట్లు పెద్దవి, విశాలమైనవి. ఇక్కడ ఎన్ని గుహలున్నాయో, ఎన్ని సొరంగాలున్నాయో... అంతు పట్టేలా లేవు. హిమాలయాలు ఏర్పడుతున్నప్పుడు ఎన్నెన్ని అగ్నిపర్వతాలు ఇక్కడ ప్రజ్వలించి నిశ్శబ్దమై ఈ గుహలు ఏర్పడ్డాయో! వేల మైళ్ళు విస్తరించి ఉన్న ఈహిమాలయాల కింద, సరస్సుల కింద, గ్లేసియర్ల కింద ఇంకా ఇలాంటి రహస్యాలు ఎన్ని దాగి ఉన్నాయో!

బయటి ప్రపంచానికి ఇప్పటిదాకా వీటి ఉనికి చూచాయగానైనా తెలియదంటే వీటి పైన ఎంతో ఎత్తయిన పర్వత శిఖరాలు ఉండొచ్చు. ఆ పర్వతాల కింద సముద్ర మట్టానికి కొన్ని వేల అడుగుల లోతుల్లో ఇవి ఉండొచ్చు. ఈ లోకంలోనే ఉన్న మనుషులకు తెలియని వీటిని మరో గ్రహ వాసులు గుర్తించి, తమకోసం ఉపయోగించు కోవడం అనూహ్యంగా ఉంది.

అక్కడ ఉన్న కొన్ని శిలలు నీలి పసుపు ఎరుపు రంగుల్లో వింతగా మెరుస్తున్నాయి. ఆ కాంతుల్లో ఆ గుహలో వెలుగు నిండిపోతున్నది. వాళ్ళు అలా కొంత దూరం నడిచిన తరువాత ఓ పెద్ద బండరాయి దగ్గర నిలబడింది ప్రాచీ. దాని మీద వేళ్ళతో సుతారంగా ఒక రకమైన శబ్దం చేసింది. కాసేపటికి ఆ రాతి పక్కన ఉన్న గుహగోడ లోంచి ఓ ద్వారం లాంటిది తెరుచుకుంది. వాళ్ళు దానిలోంచి లోపలికి నడిచారు.అక్కడ ఓ పెద్ద హాలు లాంటిది రెండు అంతస్తులుగా ఉంది. పై అంతస్తులోకి వెళ్ళడానికి ఓ పక్కన మెట్లున్నాయి.

"ఈ రాతి గోడల వెనుక అనేక గుహలున్నాయి. వాటిలోనే ఎన్నో ప్రాంతాలనుంచి ఎత్తుకొచ్చిన ఎంతో మంది బందీలుగా ఉన్నారు. వాటిలోకి మాయ తప్ప మరెవ్వరూ వెళ్ళలేరు. బయటినుంచి కనీసం గాలీ, వెలుతురూ, శబ్దం కూడా లోపలికి వెళ్ళే అవకాశం లేదు" చెప్పింది ప్రాచీ.

"అయితే మా అమ్మానాన్న కూడా...?"సందేహంగా అడిగాడు బాలవర్ధన్.

"మీ నాన్న కూడా ఇక్కడే ఉన్నాడు. మీ అమ్మ మాత్రం మరో గదిలో ఉంది. మా అమ్మ కూడా అక్కడే ఉంది. పద అక్కడికి పోదాం" అంటూ అటువైపు నడిచింది ప్రాచీ. బాలవర్ధన్ ఆమెను అనుసరించాడు.

అటువైపు నడుస్తుంటే బాలవర్ధన్ మనసు చెప్పలేనంత ఉద్వేగానికి లోనవుతున్నది.

పదహారేళ్ళ కిందట తనను తాను చూసుకుంటున్నట్టే ఉంది నాగమణికి. తన కొడుకు ముమ్మూర్తులా అచ్చం తన లాగే ఉన్నాడు! అవి తన కళ్ళే. అది తన ముఖమే! తన నోట్లోంచి ఊడిపడ్డట్టున్నాడు. అది తన గొలుసు. ఆనాడు తన కొడుకు మెడలో వేసింది. తన గొలుసు ఇంకా తన కొడుకు మెడలో అలాగే ఉంది. నాగమణి హృదయం సంతోష చంద్రశాలగా మారి, ఆనంద తాండవ మాడుతున్నది.

బాలవర్ధన్ మనసుకూడా అలాగే ఉంది. తనను తాను చూసుకుంటున్నట్టు! 'అమ్మ తనలాగే ఉంది.

ఉహు! తాను అచ్చం అమ్మ లాగే ఉన్నాడు!' అనుకున్నాడు."అమ్మా!" అంటూ వెళ్ళి ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు. తాను తన బాల్యంలో ఆ తల్లి ఒడిలో ఒదిగి పోయి, ఆమె స్పర్శను అనుభవించింది కేవలం ఇరవై రెండు రోజులే. ఈ పదిహేనేళ్ళ ఎడబాటు ఆ స్పర్శలో తెలుసోంది ఆ ఇద్దరికి. ఆమె కూడా బాలవర్ధన్‌ను ముద్దులతో ముంచెత్తుతున్నది. కాలం వాళ్ళ మధ్య అలా ఆగిపోయి కరిగిపోతున్నది.




ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

"అమ్మా! ఇంత కాలానికి ఇలా మీరు కలుసుకున్నందుకు మీకు చెప్పలేనంత సంతోషంగా ఉంటుంది. మీ మానసిక పరిస్థితి ఏమిటో మేం ఊహించగలం. కానీ మీరు కొంత సంభాళించుకోవాలి. మీ ప్రేమలు పంచుకోవడానికి కావలసినంత సమయం ఇప్పుడు లేదు" అంటూ వాళ్ళను ప్రాచీ తల్లి సంఘమిత్ర తట్టి చెప్పింది.

"మనం ముందు జరగాల్సిన కార్యక్రమం ఆలోచించుకోవాలి. బాలవర్ధన్! ఈమె మా అమ్మ సంఘమిత్ర బాయి" అంటూ తన తల్లిని పరిచయం చేసింది ప్రాచీ. నాగమణి కూడా తనను తాను నిగ్రహించుకుంటూ "ఇంట్లో అందరూ బాగున్నారా నాన్నా?, తాతయ్యా అమ్మమ్మా ఎలా ఉన్నారు?" అని అడిగింది.

"అందరూ బాగున్నారమ్మా!" అని బాలవర్ధన్ వివరంగా చెప్పబోతుంటే ప్రాచీ మధ్యలోనే వారిస్తూ,

"మిగతా వివరాలన్నీ తరువాత. అందరూ బాగున్నారు కదా! అది చాలు. ఆంటీ! మాయ గురించి, అతని కార్యక్రమాల గురించి మీరు తెలుసుకున్న వివరాలు చెప్పండి" నాగమణిని అడిగింది.

"సరే, ఆ విషయాలే చెప్తాను. వినండి..."అంటూ తాను తెలుసు కున్న విషయాలు వాళ్ళకు చెప్పడం మొదలు పెట్టింది నాగమణి. "మన భూమికి ఓ ఇరవై ఐదు లక్షల కోట్ల మైళ్ళ దూరంలో ఓ నక్షత్రం ఉందట.

దాన్ని మనవాళ్ళు 'ప్రాక్సిమా సెంటారై' అని అంటారట. దాని చుట్టూ పది గ్రహాలు తిరుగుతున్నాయట. వాటిలో నాలుగవది మాయ ఉండే గ్రహం. దాన్ని వాళ్ళు 'ఈర్తర్' అంటారట. చాలా విషయాల్లో ఆ గ్రహం దాదాపుగా భూమిలాగే ఉంటుందట. ఆ గ్రహవాసులు కూడా చాలా వరకు మన లాగే ఉంటారట. కానీ వైజ్ఞానికంగా మనకన్నా ఎంతో ముందున్నారట. కొంత కాలం కిందట వాళ్ళ గ్రహంలో ఓ విచిత్రమైన, ప్రాణాంతకమైన వైరస్ ఏదో పుట్టుకొచ్చిందట. దాన్ని అదుపు చేయడం వాళ్ళ వల్ల కాలేదట. దాని బారిన పడి ఎన్నో వందల కోట్ల మంది చచ్చిపోయారట. దానికి విరుగుడు మందునూ, వ్యాక్సిన్‌నూ కనిపెట్టడానికి తగిన పరిస్థితులు ఈ గ్రహంమ్మీద మాత్రమే ఉన్నట్టు వాళ్లు తెలుసుకున్నారట. కానీ వాళ్ళు ఇక్కడికి రాలేరు. ఇక్కడి వాతావరణంలో వాళ్లు జీవించలేరట. అందుకే తమకు అవసరమైన మందునూ, వ్యాక్సిన్‌నూ కనిపెట్టడానికి వాళ్ళు ఇక్కడికి ఈ మాయను పంపారు. మనం మాయ అంటున్నది ఓరోబో. కనుక దానికి మామూలుగా మరణించే అవకాశం లేదు." చెప్పడం ఆపింది నాగమణి.





"మరి ఎలా మరణిస్తుంది ఈ మాయ?" బాలవర్ధన్ అడిగాడు తల్లిని.

"ఇక్కడికి తూర్పు దిక్కున చాలా దూరంలో కొండ లోయలతో నిండిన ఓ దట్టమైన అడవి ఉంది.

ఆ అడవిలో ఓ పర్వత శిఖరం. అది ఓ భయంకరమైన డ్రాగన్‌లా కనబడుతుంది. ఆ డ్రాగన్ శిఖరం తల ఎత్తి చూస్తున్నట్టున్న వైపు సూటిగా ఓ పదిహేడువందల మైళ్ళు వెళితే, అక్కడ భయంకరమైన ఓమహారణ్యం. అనేక పర్వతాల నడుమ ప్రత్యేకమైన ఏడు పర్వతాలు. ఓ మహాసర్పం చుట్టలు చుట్టుకొని పడుకొన్నట్టుగా, ఏడు వలయాలుగా ఉండే పర్వతాలు. అవి ప్రకృతి నిర్మించుకున్న కోటకు సప్త ప్రాకారాల్లాగా ఆకాశంలోనికి చొచ్చుకొని పోతున్నట్టు ఉంటాయి. వాటి నడుమ లోయల్లో సప్త సముద్రాల్లా విస్తరించి, పెద్ద పెద్ద అలలతో గర్జించే జలసంధులు. వాటికి రెండువైపులా కొండలనిండా నేల కనిపించకుండా పెరిగిన వృక్షాలతో అరణ్యాలు. కింద ఏముందో కనబడ నీయకుండా ఎప్పుడూ కమ్ముకొని ఉండే మేఘాలు, పొగమంచు ఆవరించి ఉంటాయి.

ఆ ఏడు పర్వతాల్లో నడుమ ఉన్న పర్వతంమ్మీద ఈశాన్యపు వాలున ఉన్న ఓ రహస్య సొరంగ బిలం.

ఆ బిలం లోంచి ఏడు వేల అడుగుల లోతుకు వెళితే ఓ పెద్ద పాతాళ గుహ. ఆ గుహలోనే ఉంది ఈ మాయ పరిశోధన శాల. అక్కడే వీళ్ళ పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతున్నాయి. అక్కడే ఉంది ఈ మాయనూ, అక్కడ పని చేస్తున్న మరికొన్ని రోబోలనూ నడిపించే శక్తి కేంద్రం. దాన్ని ధ్వంసం చేయగలిగితేనే ఈ గ్రహాంతర రోబోలనూ వాళ్ళు చేస్తున్న ప్రయోగాలనూ ఆపడం సాధ్యమౌతుంది. అక్కడ ఓ చిలుక రూపంలో ఉంటుంది మాయను చార్జ్ చేసి నడిపించే బ్యాటరీ" చెప్పడం ఆపింది నాగమణి.

"ఇప్పుడు మాయ అక్కడికే వెళ్ళాడు. ఎల్లుండి జరుపబోయే ప్రయోగానికి అవసరమైన ఏర్పాట్లు చూడడానికి" చెప్పింది సంఘమిత్రా బాయి.

తమకు ఒకే రోజు సమయం ఉంది. అంతంత దూరాలు వెళ్లడం, అన్ని అసాధ్యాలను సాధించడం మానవ మాత్రులకు కలలో కూడా సాధ్యం కాదు. కానీ బాలవర్ధన్ మాత్రం "సరే! నేను బయల్దేర్తాను" అన్నాడు వెంటనే ఏమీ ఆలోచించకుండా.

"నేను సాధిస్తాను. కానీ ఎలా అంటే ఇప్పుడే నేనేమీ చెప్పలేను. ఎలా గమ్యం చేరుకోవాలో తెలియని నా ప్రయాణం ఇప్పుడే మొదలు పెట్టాను. మానవ లోకాన్ని సంరక్షించే ఈ ప్రయత్నానికి ఈ ప్రపంచాన్ని నడిపించే శక్తులన్నీ సహకరించాలని కోరుకుంటున్నాను" అన్నాడు మళ్ళీ ఎంతో ఉద్వేగంగా.

"ఈ ఉంగరాన్ని తీసుకో బాలవర్ధన్! ఇది నిన్ను ఆ డ్రాగన్ పర్వతానికి కోరుకున్న క్షణంలో చేరుస్తుంది. ఇంకా నీకు ఉపయోగపడే కొన్ని వస్తువుల్ని ప్రాచీ ఇస్తుంది, తీసుకో. నీవు ఈ పనిలో విజయం సాధించేలా చేయుమని నేను ఆ ఆది శేషుణ్ణి ప్రార్థిస్తాను" అంటూ ఓ ఉంగరాన్ని ఇచ్చింది సంఘమిత్రా బాయి.

బాలవర్ధన్‌ను మరోసారి దగ్గరికి తీసుకొని మొఖంమ్మీదా, నుదుటిమీదా ఎన్నో ముద్దులు పెట్టుకుంది నాగమణి. ఆమె హృదయం, కళ్ళూ మాతృ ప్రేమతో తడిసి ముద్దవుతున్నాయి.

"వర్ధన్! ఇక బయల్దేరుదాం. మాయ వచ్చేలోగా నువ్వు ఈ ప్రాంతంనుంచి వెళ్ళిపోవాలి. ముందు మా యింటికి వెళ్ళాలి. అక్కడ అమ్మ చెప్పిన వస్తువులు నేను నీకు ఇవ్వాలి. తరువాత రామన్నను మా తమ్ముడి దగ్గరికి పంపించేయాలి. అక్కడ వాళ్లు చేయాల్సిన కొన్ని పనులున్నాయి. పాతాళ్ కోట్‌లో మీరున్న గది ఖాళీ చేయాలి. మీ కారును తీసుకోవాలి. నువ్వు తిరిగి వచ్చేవరకు రామన్న మాతమ్ముడితో కలిసి ఉంటాడు.

మాయ వచ్చే సమయం దగ్గర పడుతున్నది. మనం త్వరపడాలి. అమ్మా! ఈ పనులు పూర్తిచేసుకుని వచ్చేస్తాను. వర్ధన్! పద," అంటూ అక్కడ్నుంచి కదిలింది ప్రాచీ. బాలవర్ధన్ ప్రాచీని అనుసరించాడు.

(సశేషం..)



-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

## బాల కార్మికులు

కాలచక్రం క్రింద
నలుగుతున్న పసిమొగ్గలు.

చెట్టు చేమలలో పెరిగే
పుట్టగొడుగులు
విప్పారని కనుపాపలు.

అలసట రాని ఆకలి కేకలు
ఆవిరైన హృదయ స్పందనలు

మెతుకుల కోసం వెతుకులాడే
పరాన్నజీవులు.

కలల ప్రపంచానికి
రంగులద్దే రవివర్మలు.

కన్నీటి కడలిని
ఎదురీదే పోరాటయోధులు

గమ్యం లేని గమనాన్ని
శోధించే విధివంచితులు.

మాలిన్య పరిమళాలను
ఆలింగనం చేసే అభాగ్యులు

ఆశలు అడుగంటుతున్నా
రేపటి కోసం ఎదురుచూసే
చకోరపక్షులు

-రామగోపాల్ కొమ్ముల
8886501012

## బాటసారి

జీవితమనే సాగరంలో...
అనుబంధాల నావలో...
ప్రేమ అనే తీరాని కై ...
సాగుతున్న నా ఓర్పు కు...
నమ్మకాన్ని జతచేసి...
అనురాగాన్ని పంచి...
జ్ఞాపకాలను మదిలో నిలుపుకొని...
తీపి గురుతులతో రేపటి...
గమనం అనే ఉషోదయాన్ని...
ఆస్వాదిస్తూ... ఆరాధిస్తూ...
విజయమనే ఇంద్రధనస్సు కోసం...
ఎదురుచూస్తున్న
ఓ " బాటసారి " ని...



-చిటికెన కిరణ్ కుమార్
సెల్. 9490841284

## సముద్రాన్ని నేను

నేనొక తల్లి సముద్రాన్ని
నా దేహం నిండా దుఃఖం అలలు
ఏ దిక్కున నాకు తీరం లేదు
గుండె నిండా పగుళ్లతో
తనివితీరా ఏడ్వాలనివుంది
అందులోనూ ఓడిపోయాను
చప్పట్లు కొడుతున్నాయి
నా కళ్ళ నిండా దిగిన
ఓటమి గుండు సూదులు
ఇంకిపోయిన కన్నీళ్ళు
ఎండిపోయిన శరీరం
మిగిలిపోయిన ఆఖరి వూపిరి
ఇవే నేను దాచుకున్న ఆస్తి పత్రాలు.
వెలుగు చీకట్లనే కాదు
సునామీలను సైతం
నా భుజాలమీద భరించాను
పిల్లలు సరదాపడి
ఆడుకుంటామని మారంచేస్తే
నా దేహాన్ని ఆటస్థలం చేశాను
జాలరి విసిరిన పాటలన్నీ
వాళ్ళకు జోలపాటలుగా పాడాను
అగ్నిపర్వతాల ప్రేలుళ్లను
ఇంట్లో కుంపట్లు చేసి వంటచేశాను
నా శిరోజాల పడవల మీద
విహారాల సంబరాలు చేయించాను
తరిగిన నా ఆయుస్సు
వాళ్ళ శ్రేయస్సుల పాదయాత్రల్లో
కందిన పాదాలకు లేపనం చేశాను
వేధించే నా జబ్బుల పల్లకీలను
నాకు నేనే మోసుకున్నాను
చిత్రమైన బాధ ఏమిటంటే
నా కళ్లముందే నా పెంపకం
నరకాన్ని నాకు నివాసం చేశారు
విస్తరినిండా వేధింపుల వడ్డింపు
అసహ్యాన్ని చుట్టి విసిరే మాటలు
వెరసి ఒక్క మాటలో చెప్పాలంటే
నా చుట్టూవున్న వుప్పునీరంతా
నా సంతతి వుమ్మేసిన ఎంగిలినీరే.
జీవితం అర్థం కావటంలేదు
వృథాగా మిగిలిపోయిన త్యాగాలు
వృద్ధాప్యం గుడారాల క్రింద
శ్వాస ఆడక ఆయాసపడుతున్నాయి
మంచానికి అతుక్కుపోయిన నాకు
చివరకు మిగిలిందొక్కటే
గుండె ఆగే క్షణాలకోసం...గుట్టుగా
క్షణం క్షణం ఎదురుచూడటం



-డా. కె.జి. వేణు,
98480 70084

## నా తెలుగు

కమ్మని జలమును నిండుగా నిచ్చిన
సుధానది అమృత జలము నా తెలుగు.

భక్తిభావము ఎద నిండుగా నిచ్చిన
సాయి మధుర జ్ఞానామృతము నాతెలుగు.

జననీ జనుకుల ప్రేమను నిచ్చిన
పరమేశ్వరుని స్వరూపము నాతెలుగు.

ఆలి ఒడిలో వెచ్చని నిద్దుర నిచ్చిన
మల్లేపువ్వు శయన మందిరము నా తెలుగు.

గోదావరి ఉత్తుంగ తరంగాల సవ్వడి నిచ్చిన
మధుర సంగీత సుస్వరము నాతెలుగు.

ఉదయ భానుని లేలేత కిరణాలు నిచ్చిన
తెలుగు వెలుగు ప్రభలు నా తెలుగు.

వేద శాస్త్రముల జ్ఞాన మిచ్చిన
హంసవాయిని మధురగానము నాతెలుగు

-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## ప్రవాహం

ఉరకలెత్తివచ్చిన ప్రవాహం
ఆనకట్ట వద్ద ఆగింది.
ఆప్తులను పలకరించి,
ఆపై సేద తీర్చుకుని
ముందుకు సాగాలని.
చాన్నాళ్ళకి
కొత్త మిత్రులతో కలిసి
చేపలు, జలచరాల సంబరం,
పెరిగిన లోతుల్లో
సరదా ఈతల ఉల్లాసం.

ఏడాదికి సరిపడా నీటిని
కానుకగా తెచ్చిన బంధువుకు
గట్ల వెంబడి చెట్టూ చేమలు,
వింజామరలు విసురుతూ
సత్కరించుకుంటున్నాయి .

అలసిన తనువుకు
గట్లనడుమ అలలు
ఊయలూపుతుంటే,
గలగలలు మాని నిదురపొమ్మని
గాలి కమ్మని జోలపాడుతోంది.

తొణుకూ , బెణుకూ లేని
నిండు కుండైన
జలాశయం ఠీవి చూసి
పంటపొలాల మనసు
గర్వంతో పొంగిపోయింది .

తలుపులు తెరిచిన మరుక్షణం
దర్శనానికి పరుగులెత్తే భక్తుడిలా
ఒక్క ఉదుటన దూకుతున్న
నీటి ఒరవడికి
అవాక్కయిన ద్వారాలు
నోళ్లు వెళ్ళబెట్టి చూస్తున్నాయి.

మరో ప్రాంతం
గొంతు తడపటానికి
ముందుకు సాగుతున్న ఏటిని
ఇప్పుడు వెళ్ళి, మళ్ళీ రమ్మని,
వృక్ష, జంతు రాశులు సాదరంగా
వీడ్కోలు పలుకుతున్నాయి.

-సాదరి మోహన్ గౌడ్
9440464503

## బాల గేయం

## వినండి చెబుతా నొకమాట

వినండి చెబుతానొక మాట!
కనండి తెలిపే మేటి బాట! ॥వి॥

మెల్లగ మొక్కలు పెరిగే దశలో
పిల్లగాలికీ నేలకొరుగును!
పిల్లలు కూడా మొక్కల్లాగే
మితి మీరితే పడిపోతారు!
మొక్కలకంతా 'ట్రీగార్డు'లు
చక్కగ అవసరమైనట్లే
పిల్లలకంతా పితరుల రక్షణ
చల్లగ ఎపుడూ కావాలి! ॥వి॥

ఎదిగిన చెట్లు గాలికి నిలిచి
ఎంతో గాలిని ఇస్తాయి!
పైగా విషవాయువులే పీల్చి
ప్రాణవాయు వందిస్తాయి!
ఎదగిని పిల్లలు అటులే నిలిచి
ఎన్నెన్నో సాధిస్తారు!
ఇంటి సుగతికై-దేశ ప్రగతికై
కంటి రెప్పలా నిలుస్తారు.



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## ఎప్పుడూ ఇదే మాట

అప్పుడూ ఇదేమాట కదూ
ఈ ప్రపంచం ఎండలో అరేసి మరచిపోయిన
పంచవన్నెల పట్టు పరదా
అయితేనేం
రంగులు వెలసిపోయి
వెలవెల బోతున్న ఒక అలుగ్గడ్డ.
నాకున్న సమస్తం పచ్చని పొద్దై
రినాచుట్టూ అల్లుకున్న మల్లె తీగ
మార్గ శిర మాసపు మంచు దాడిలో
కొంకర్లు బోయే చలికి
వెచ్చని చలిమంటలాటి నీ ఉనికేనని.

ఏది ఎలా మారితేనేం
ఇష్టమైన క్షణాలు మనసును మభ్యపెట్టి
కాలం నెరియల్లో ఉన్నట్టుండి అదృశ్యమైతేనేం
దిగులు సంకెళ్ళు కట్టిపడేసి
దుఃఖం కవచకుండలంగా మారితేనేం
ఇప్పుడూ అదే మాట
ఖచ్చితంగా కంట్లో దిగిన ముల్లును లాగి నిప్పుల్లోకి
విసిరేసినదే ఈ ప్రపంచం.
అప్పుడూ ఇప్పుడూ
ఎప్పుడూ ఏ పదాల్లోనూ ఇమడని
అనంతమైన వేదన మనిద్దరి చుట్టూ తచ్చాడుతునే ఉన్నా
నువ్వే నా వేసంగి విడిదివి
నువ్వే నా వెచ్చని ఊలు రజాయివి.

రోజంతా కొత్త కుండలా చెమర్చి చెమర్చి చల్లబడిన తలపు
రాత్రయేసరికి మధుర పరిహాసాలు, మరచిపోలేని
తొలకరి జల్లులూ కనురెప్పల వెనక మరోసారి ప్రదర్శించిన
స్వప్నాల మెరుపులూ కావలసినన్ని సేకరించుకు
పాటల పరిచ్ఛాయల వెనకా గరిక పచ్చ గోడలమీదా చూసి
గుండె మరోసారి గతి తప్పుతుంది - ఎప్పటి మాదిరిగానె.

తట్టుకోలేని తపన
కళ్ళలోనూ , నదీ ప్రవాహపు ఊసుల మధ్యా
ఆదమరచిన నిద్రలోనూ
ఎదురు చూపుల వాకిట్లోనూ వరద గోదావరే.
ఎప్పటికప్పుడు ఏకాంతాన్ని దిగమింగి
ఇప్పుడూ అదే మాట కనిపించని
నీ పాదముద్రలే నాఉనికి.



-స్వాతీ శ్రీపాద
8297248988

## ఆసరా

రాతిరివాకిట్లో నుంచున్న
మనసు తొణకిన మాటొకటి
నూతనత్వంలోకి చేయికలపమంది...
తిరిగి రాని ప్రతిక్షణాన్ని
వాడని జ్ఞాపకంలా మలుచుకోవాలంది..
కరిచి పోయిన అపార్థాల కందిరీగ
ముందున్న ముఖం నిండా కోపాన్ని రుద్దిపోయింది..?
అనారోగ్యానికి అంటుగట్టిన ఆత్మన్యూనత
అదే పనిగా వెక్కిళ్లు పెడుతూ-
రెండు దేహాలనడుమ
ఒదిగిన అపరిచిత మౌన సంభాషణ-?!

పొడిబారటం సరికాదు,
తడిగా మారటంలోనే అనుబంధం-!
ఆనందానికి ఆరోగ్యం..
ఆరోగ్యానికి ఆనందం
రెండూ తోడు నీడ-
దూరం పెంచే నీడలు
స్థిమితం లేకుండా చేస్తుంటాయి-

ఇప్పుడు ఒకప్రశ్నకు వేల జవాబులు-!
ఏమిటిది..?
కాలం తీరుకీ..మనసు లోతుకీ..
కొలమానాలెక్కడ-?
సందిగ్ధం..సంకోచం...
హృదయాలు మరింతగా బిగదీసుకుంటూ-
అలుక పూనిన ఆలోచనల అంచు
అప్పటికప్పుడు గాయాలని
గురుతుకు తెస్తుంది....
మోసిన భారాల్ని లెక్కకడుతుంది....
ఏకోన్ముఖంగా సాగాల్సిన దేహాలు
పరిపరి విధాల పలవరింతల మధ్య-

అది వెన్నెలైనా.. వేకువైనా..
మెల్లగా..ఒకింత ఓపికగా
నడవాల్సిందే..నడిపించాల్సిందే..
చీకటివెలుగుల ప్రయాణం సాగిచాల్సిందే-
ఎక్కడ అలిసిపోతున్నా..
ఎక్కడ జారిపోతున్నా..
జీవితం నిండా
ఒకరికి ఒకరే ఆసరా-!!



- మోతుకూరి అశోక్ కుమార్
9247380976

## వెలుగు పూల బాటలు

చుట్టురా అంధకార చాయలు
ఏ తీగ కదిలించినా ఎవరి డొంక కదులునో
క్షణక్షణం రణరంగమైన ఈ జీవిత సమరాన
ధైర్యమనే దివిటీ తారాజువ్వలా ఎగిసిన వేళ
నిశ్శబ్ద నిశి సైతం తొలకరి చినుకులోలే
వెలుగుల తుంపరలై దేదీప్యమౌతుంది
నిత్య ఆటుపోట్ల తుపాను సుడిగుండంలో
జీవితంలో ఎన్ని రేయింబవళ్లను తట్టుకోవాలి
చెడును గుర్తించలేక, మంచిని వదులుకోలేక
ఎత్తువంపుల చింపుల సాందిరిలో పయనమెన్నాళ్ళు
పోట్రాళ్ళెన్ని తాకినా వేలి గాయం ప్రశ్నిస్తూనేవుంటది
ఎంత వేదనకు గురైనా ఎదురీదడంలోనే జవాబుంది
సమాజమే నిత్యాన్వేషణ పుస్తకమైనంత
సమస్యలకు విలవిలలాడితే సైనికుడివెట్లయితవు
ఇష్టమైన కష్టమైనా కదిలేది మునుముందకే
కదలలేక కాలు వెనకడుగు పడిందంటే
ఆశలు ఆశయాలకు నీళ్ళోదలాల్సిందే
ప్రశ్నించిన చోటే పదిమంది పలుకరిస్తరు
పట్టుదల వుంటేనే ఫలితం లభిస్తది
నిప్పుల కుంపటిలా కన్నెర్ర జేస్తున్న సమాజంలో
నిశ్శబ్ద విప్లవంతో తనవైపు లాగేయడం సులువే
ఒక గమ్యానికి ఎన్నో పిల్లదారులున్నట్లు
ప్రతి చీకటికి వెలుగు దారులుంటాయి
అలోచనామృత అడుగులతో సాక్షాత్కారమైన చోట
వెలుగు పూల బాటలై సుగంధం వెదజల్లుతాయి

-ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

## పాద ముద్రలు

మంటలందుకునే..
చెమట చుక్కలు.
మంటలక్కూడా చెమట.
పట్టించే తెగువలు !.
నిశ్శబ్దంలో దాగిన..
ఆవేశాగ్ని భావనలు.
నెగ్గేదెవడు పోరులో.?
చివరి దెబ్బ కొట్టినోడేగా !.
కారడవిలోలో పెరిగిన..
పులి రాజస జీవనం.
తను కూర్చున్న చోటేగా..
సింహానికి సింహాసనాలు !.
కండలు నరాల వీణలు
శ్రమజీవుల సుస్వరాలు
విస్ఫోటనాలు దాగిన..
కండరాల స్థితిస్థాపకతలు !.
కష్టాలను కంపింప చేసే..
కఠోరయజ్ఞ దేహగుండాలు.
దాసోహమనే..
లక్షల లక్ష్యదారులు !.
సదా భయ పడే..
బతుకు కష్టనష్టాలు.
వరించడమే తెలిసిన..
విజయ పుష్ప మాలలు !
చేతుల మురికి కడగ్గలవు
తుడువ లేవు మనో మాలిన్యాన్ని
అంతర్ కాలుష్యాన్ని చెరుపు..
బాహ్యదేహమదే శుద్ధి అగును !
నేటి పాద ముద్రలే కావాలి..
ఒపటి జాతీయ రహదారులు.
చరిత్రలో చెదరని పేజీలు..
సమాజ జయజయ ధ్వానాలు !



-డా బుర్ర
మధుసూదన్ రెడ్డి
9949700037

హైదరాబాద్ పాతనగర కవుల వేదిక
సురభి ఎడ్యుకేషనల్ సొసైటి
సంయుక్త అధ్వర్యంలో
శ్రీ పి.వీ. నరసింహా రావు శతజయంతి సందర్భంగా
కవితల పోటీలో బహుమతి పొందిన విజేతలు



ప్రథమ బహుమతి (రూ.3116/-)
(లోపలి మనిషి) శ్రీ నూటెంకి రవీంద్ర



ద్వితీయ బహుమతి (రూ.2116/-)
(బలగంలేని నాయకుడు) శ్రీ గుండేటి రమణ



తృతీయ బహుమతి (రూ.1116/-)
(తోరణం) శ్రీమతి అరుణ నారద భట్ల

కన్సోలేషన్ బహుమతులు (రూ.516/-)
(శేషకీర్తి సువర్ణ ఛత్రం) శ్రీ కొత్తపల్లి ఉదయ బాబు
(స్మరణ) శ్రీ గుమ్మడి సాంబ మూర్తి
(సహస్ర ఫణి) శ్రీ తిరునగరి శ్రీనివాస్
(నీవు ఎవరు) శ్రీమతి పీ.వి.యస్. కృష్ణ కుమారి
(మన టీవి) శ్రీమతి మంజుల సూర్య
(రథ సారథి) శ్రీమతి ములుగు లక్ష్మీ మైథిలి
(నిన్ను తలంచి) శ్రీమతి సమ్మెట ఉమాదేవి
(ఆయనొక మౌని) శ్రీమతి పూసల రజనీ గంగాధర్
(దేశగతి మార్చిన ఋషి) శ్రీ వాడపర్తి వెంకట రమణ
(స్థిత ప్రజ్ఞుడు) శ్రీ కొలిపాక శ్రీనివాస్
త్వరలో డా. వాసిరెడ్డి రమేష్ బాలోత్సవ్ గార్ల సహకారంతో
జరుపబోయే సభలో బహుమతి ప్రధానం జరుగుతుంది.
పోటికి పంపిన కవితలన్నీ పుస్తకంగా రాబోతుంది.
కన్వీనర్
కే. హరనాథ్ 9703542598



## రాత - గీత

### హమాలి

భూగోళాన్ని
భుజంపై మోస్తున్న
అట్లాస్ వీరుడు



### బ్యూటీ గర్ల్

ప్రకృతి అందాన్ని
పరిహసించేది
ఉన్న అందాన్ని
ఉల్లంఘించేది
కృత్రిమ అందాల కురూపే
బ్యూటీ పార్లర్ కెళ్ళే
బ్యూటీ గర్ల్.





రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి

నేటినిజం చందా వివరాలు
ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.700/-, 10 సం॥రాలకు రూ 1200/- మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660 Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.
'నేటినిజం' దినపత్రిక, ఎస్‌ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.






# కృష్ణ కోకిల గానం చేసిన "వడ్డేపల్లి రాగ రామాయణం"

**"వడ్డేపల్లి రాగరామాయణం" గ్రంథానికి ప్రముఖ వాగ్గేయకారుడు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి దేశపతి శ్రీనివాస్ రాసిన ముందు మాట ఇది**

-సంపాదకులు

నిరంతర రచనాశీలి శ్రీ వడ్డేపల్లి కృష్ణగారు. ఆయన కలం కవితా సరస్వతికి సమర్పణంగా నిత్యం పద్య గేయ ప్రసూనాలను పూస్తూనే ఉంటుంది. ప్రముఖ పత్రికల నుండి చిన్న పత్రికల దాకా అన్ని చోట్ల ఆయన చిరునవ్వుల చిత్రం కనిపిస్తూనే ఉంటుంది. మగ్గం చప్పుడే గుండెచప్పుడైన సిరిసిల్లలో పుట్టి పెరిగి, సమాజం విధించిన అనేక అవాంతరాలు, అననుకూలతలను అధిగమించి వెండితెర మీద వెలుగు సంతకం చేసారు. పడుగు పేకల నేత ఆయన వారసత్వం, భావ రాగాల కలనేత ఆయన జీవనతత్వం. పలు ప్రక్రియ లలో సమాంతరంగా సాహిత్య సృజన చేసినా గేయమే ఆయన గేహం. పాటనే ఆయన బాట. తన కవితా సుగంధం ఆబాలగోపాలాన్ని అలరించాలని ఆయన లలితమైన ఫణితినే ఎంచుకున్నారు. సామాజిక సంక్లిష్టత మనసుకు పట్టదు కనుక సాహిత్యం లోనూ ఎక్కడా ఏ క్లిష్టతా కనిపించదు. నొప్పింపక తానొవ్వక సాగిపోయే దృక్పథం.

భారతీయ కవితా శాఖపై వాలిన వాల్మీకి కోకిల పాడిన మధురమైన రామాయణ కథను పసి గొంతులలో రాగ రంజితంగా పలికించాలనే వడ్డేపల్లి కృష్ణ గారి తపనకు అక్షర తార్కాణం, ఈ బాల రాగ రామాయణ సాక్షాత్కారం. లయబద్ధంగా స్వభావోక్తిలో సాగిన కథా ప్రవంతి పిల్లలకు సులువుగా పట్టుబడుతుంది. వారి సుకుమార హృదయాలమీద సుందరమైన ఊహల తేనెపట్టు కడుతుంది. "మిథిలా నగరం దారిలో శిథిల ఆశ్రమం ఒక్కటి" అనెడు పద బంధాలు సమయోచితంగా అక్కడక్కడా అరుదుగా అనుప్రాసలో ఇతర శబ్దాలంకారాలో తప్ప మిగతా అంతా సరళ సుందరంగా సాగే కథాగమనమే పిల్లల మేధో స్థాయికి కవి దిగివచ్చి రాసిన కావ్యం ఇది. మనిషిలో ఒకింత అమాయకత్వం మిగిలున్నవాడే కవి కాగలుగుతాడు. తనలోపల ఒక పసివాడిని సజీవంగా నిలుపుకుంటేనే బాల సాహిత్యం రాయగలుగుతాడు.

మన మట్టి సుగంధం నింపుకున్న భాషలో, మనదైన జీవితం ప్రతిఫలించే బాల సాహిత్యం కరువైపోయిన దశలో జీవిస్తున్నాం మనం. వడ్డేపల్లి కృష్ణగారు ఆ ఖాళీని కొంతైనా నింపే ప్రయత్నం చేస్తున్నారు. మనవైన పలుకుబడులు, నానుడులు, సామెతలు – జాతీయాలు పూలదండకు చమ్కీలద్దినట్టు నడుమ నడుమ ఈ రామకథలో ప్రకాశిస్తున్నాయి. పిల్లలలో ఊహాశాలిత శబ్దశక్తితో పాటూ సంస్కారమూ సోదరభావమూ పెంచేందుకు, జాతీయ సమైక్యతా సూత్రాన్ని పెనవేసేందుకు ఇటువంటి రచనలు తోడ్పడతాయి.

శిరమున మేల్ముసుగుతోడ – కరమున వరమాల తోడ
సహచరులగు చెలులతో – సందడియగు అందెలతో
సిగ్గులతో ఎరుపెక్కిన – బుగ్గలతో భూపుత్రిక...

స్వయంవర సన్నివేశంలోని సీతను అలతి అలతి మాటలతో అందంగా బొమ్మకట్టారు. కళ్యాణ గాత్ర అయిన కమనీయమూర్తిని పసికన్నుల వాకిళ్ళలో నిలబెట్టారు. "ఆ జనకుని అనుజుడైన కుశధ్వజుని కూతుళ్ళగు మాండవి శ్రుతకీర్తులను" – మాండవి శ్రుత కీర్తులు జనకుని కూతుళ్ళనే అంతా అనుకుంటారు. వాళ్ళు ఆయన అనుజుడైన కుశధ్వజుని కుమార్తెలనే విషయాన్ని ఎంతో అప్రమత్తంగా తెలియజేసారు కృష్ణగారు. అంటే రామాయణం లోని ఏ సూక్ష్మాంశాన్ని వదలకుండా ఈ కావ్యంలో పొందుపరిచారాయన.

"మెరుపును మేఘము కలిసిన
మురిపెము దర్శనమాయెను
కన్నవారి కలలు పండ
కన్నుల హర్షము నిండెను."

సీతారాముల కళ్యాణ మంటపంలో మేఘము మెరుపు కలిసిన మురిపెం కనిపిస్తున్నదట. అవును మరి రాముడు నీలమేఘశ్యాముడు, సీతమ్మ తల్లి మెరుపుతీగ. ఆ ఇద్దరి కలయిక మేఘం కడ మెరుపు నిలిచిన మురిపెమే కదా. ఎంత మనోహర కవితా వాక్యం ఇది.

ఇటువంటి అందమైన కవిసమయాలు ఈ కథాగమనంలో తటిల్లతలై మెరుస్తాయి. క్లుప్తతను పాటిస్తూ, సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ, కథలోని ప్రతి విలువైన విషయాన్ని సుబోధకంగా రచించిన వడ్డేపల్లి కృష్ణ గారికి మనసారా అభినందనలు. ఈ గేయ గాథ తెలుగు బాలల గొంతుల్లో శ్రుతిసుభగంగా మార్మోగాలనీ, వాల్మీకి నుంచి వడ్డేపల్లి దాకా అవిచ్ఛిన్నంగా సాగిన భారతీయ సాహిత్య సాంస్కృతిక జీవన మూల్యాలను భావితరం అందుకోవాలని ఆశిస్తున్నాను.



-దేశపతి శ్రీనివాస్
ప్రముఖ వాగ్గేయకారుడు
ముఖ్యమంత్రి
కార్యాలయ ప్రత్యేకాధికారి,
తెలంగాణా ప్రభుత్వం

## అన్నదాతల ఆక్రందనలు..

అన్నాలారా! ఓ రైతన్నలారా !
ఎవరి కోసం ఆ ఎదురుచూపులు?
ఎవరో వస్తారని ఏదో చేస్తారని
ఎంత కాలం ఈ నిరీక్షణ ?
ఎంతకాలం ఈ నిరాశా నిట్టూర్పులు?
ఎంతకాలం ఈ మొద్దునిద్ర ? వద్దు వద్దు
ఇకనైనా నిద్ర మేల్కొండి ! నిజం తెలుసుకోండి!

ఓ రైతన్నల్లారా!
మీకు కొడవలిపట్టి కొయ్యడం తెలుసు
కలుపుమొక్కల్ని పేరెయ్యడం తెలుసు
ఓ ప్రత్తి రైతుల్లారా! ప్రతిఘటించండి !
ఓ పొగాకు రైతుల్లారా ! పోరుకు సిద్ధంకండి!
కత్తులై కదం తొక్కండి!
ఓ చెరుకు రైతుల్లారా ! పిడికిలి బిగించండి
పిడుగులు కురిపించండి !
ఓ గోధుమ రైతుల్లారా ! గొడ్డళ్లు నూరండి!
నిరసనలు తెలియజేయండి ! నిప్పులు కురిపించండి!

అన్నదాతలకే అన్యాయం జరిగితే
అన్నదాతలనే వెన్నుపోటు పొడిస్తే
అన్నదాతల గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలైతే
అన్నదాతల కళ్ళు కన్నీటి సముద్రాలైతే
అన్నదాత నెత్తిన పిడుగులు పడితే
అన్నదాతల వెన్ను విరిగితే అందరి నోట్లోమట్టేనని
అన్నదాతలే కన్నుమూస్తే దేశమంతటా
కరువు కరాళనృత్యమేనని ఆకలిచావులేనని
పాషాణహృదయులైన పాలకులకు తెలియజేయండి

చెవులుండీ ... మీ ఆకలి కేకలు... వినని
కళ్ళుండీ...మీ ఆకలిచావులు... చూడని
మనసుండీ...మీ ఆక్రందనలు...ఆలకించని
చేతులుండీ... మీకింత.....చేయూత నివ్వని
అధికారముండీ...మిమ్మల్ని...ఆపదలోఆదుకోని
కుంటి గుడ్డి మూగ చెవిటి పాలకులను
ప్రశ్నించండి సంఘటిత శక్తిగా పోరాడండి
ప్రతిఘటిస్తేనే... ప్రగతని...
ప్రశ్నిస్తేనే......ప్రతిఫలమని...
ఉద్యమిస్తే... ఉషోదయమని...
సంఘటిత శక్తే... సమస్యలకు పరిష్కారమన్న
నగ్నసత్యాన్ని తెలుసుకోండి !
ఉరుములా ఉరమండి... మెరుపులా మెరవండి
ఉగ్రులై ...ఉద్యమించండి...
నల్లచట్టాలు రద్దయ్యేంతవరకు...
విజయం మిమ్ము వరించేంతవరకు...
విశ్రమించకండి....



-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

# రమణీయం-రసరమ్యం-శ్రవణ సుందరం 'వడ్డేపల్లి రాగరామాయణం- డా॥కె.వి.రమణాచారి

డా॥వడ్డేపల్లి కృష్ణ ఎన్నో కావ్యాలు, సంగీత నృత్య రూపకాలు, ఆడియో ఆల్బమ్‌లు, నాటిక–నాటకాలు, డాక్యుమెంటరీలు ఇలా అన్నీ ప్రక్రియల్లో అందెవేసిన చెయ్యిగా నిలిచినా అవన్నీ ఒక యెత్తయితే.. ఈ రాగ రామాయణం ఒక యెత్తని, ఈ బాలల గేయకథ 'వడ్డేపల్లి రాగరామాయణం' రమణీయం– రసరమ్యం– శ్రవణసుందరం అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు,తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ డా॥కె.వి. రమణాచారి అభివర్ణించారు. రామాయణ, మహాభారతం, భాగవతాలు భారతీయులందరికి పవిత్ర గ్రంథాలని, రామాయణంలో మనిషి ఎలా వుండాలో మహాభారతంలో మనిషి ఎలా వుండకూడదో తెలుపుతుందని, రామాయణం మనిషికి మార్గోపదేశం కావించే అత్యుత్తమ కావ్యమని, రామాయణాన్ని బాలలకు సుబోధకంగా,సరళంగా రచించిన వడ్డేపల్లికృష్ణ జన్మ ధన్యమైందని శుభాభివందనాలు తెలిపారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ కవి డా॥వడ్డేపల్లి కృష్ణ బాలల కోసం సరళంగా రచించిన 'వడ్డేపల్లి రాగరామాయణం (బాలల గేయకథ)' పుస్తకావిష్కరణోత్సవం బుధవారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో కోవిడ్–19 నిబంధనల దృష్ట్యా నిరాడంబరంగా, ఘనంగా జరిగింది. సీనియర్ సంపాదకుడు వై.యస్.ఆర్.శర్మ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా॥కె.వి.రమణాచారి, విశిష్ట అతిథులుగా నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్ సి.ఎస్.రాంబాబు, వ్యాపారవేత్త కుర్రా శ్రీనాథ్, పుస్తక రచయిత, సుప్రసిద్ధ కవి డా॥వడ్డేపల్లి కృష్ణ, డా॥సంగనభట్ల నర్సయ్య, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా డా॥కె.వి.రమణాచారి తదితర అతిథుల చేతులమీదుగా 'వడ్డేవల్లి రాగరామాయణం (బాలల గేయకథ)' పుస్తకాన్ని ఆవిష్కరింపజేసి తొలిప్రతిని పుస్తక రచయిత వడ్డేపల్లి కృష్ణ కె.శ్రీనాథ్‌ను ఘనంగా సత్కరించి అందించారు. అనంతరం డా॥కె.వి.రమణాచారి మాట్లాడుతూ సర్కస్‌లో రింగు మాస్టర్ వద్ద పులులు ఒద్దికతో చేరి కూర్చుంటాయో సాహిత్యపదాలు వడ్డేపల్లి రచనల్లో వచ్చిచేరుతాయని, అది డా॥సినారె ఏకలవ్య శిష్యుడుగా ఆయన కృషి అన్నారు. ఈనాటి పిల్లలకు గురు, మాతృ పితృభక్తి–వాటి విలువ అనేదాన్ని తెలుపడానికి వడ్డేపల్లి గేయ రామాయణాన్ని 46 ఖండికలుగా సందేశాత్మకంగా వ్రాసారని అభిప్రాయపడ్డారు. కృష్ణ లలితగీతాలకు పెట్టిందిపేరని 1995లో ఆకాశవాణి 'బాలల జాతీయ సామూహిక గానంకై వడ్డేపల్లి కృష్ణ రచించిన "మనమంతా ఒక్కటనే–మంచి మనసు పెరగాలి" అనే లలితగీతాన్ని కేంద్రస్థాయిలో ఉత్తమగీతంగా ఎంపికచేసి, దేశవ్యాప్తంగా అన్ని రేడియో స్టేషన్ల ద్వారా సెప్టెంబర్ నెలంతా ఆయారాష్ట్ర భాషల్లో అనువాద సహితంగా ప్రసారమై జాతీయస్థాయి గుర్తింపు పొందారని అన్న డా॥కె.వి.రమణాచారి మేటికవిగా నేడు రామాయణాన్ని రమణీయంగా రచించారని, సినీ దర్శకుడుగా, నిర్మాత, వివిధ ప్రక్రియల రచయితగా సాగుతున్న కృష్ణ మరింతగా పేరు ప్రఖ్యాతులు గాంచాలని ఆకాంక్షించారు. ముందుగా గాయని అలేఖ్య ఈ రామాయణ ప్రథమగీతాన్ని రాగయుక్తంగా ఆలపించి వీనులవిందు చేయడం, భద్రాచలం భద్రాద్రిలోని శ్రీ సీతారామ లక్ష్మణ స్వాములకు భక్తిభావంతో ఈ కావ్యాంకితం చేయడం విశేషం.



వడ్డేపల్లి 'రాగరామాయణం ఆవిష్కరణ సభలో డా॥ సంగనభట్ల నర్సయ్య, సి. రాంబాబు, బైస దేవదాసు, వై.యస్.ఆర్.శర్మ, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, కె. శ్రీనాథ్, వడ్డేపల్లి కృష్ణ, మద్దాళి రఘురామ్.



వడ్డేపల్లి కృష్ణను సత్కరిస్తున్న అతిథులు.

## నిన్నటి కన్నా మొన్న నయం !!

ఈ రోజు కన్నా
నిన్న నయం --
నిన్నటి కన్నా మొన్న
శీఘ్ర సమాచారంగా శుభం లాభం
ఇగ రేపటి మాట
ఎవరికీ కట్టరాని నీటిమూటే !
ఇప్పుడే మన ముఖాలను మనం
ముఖాముఖిగా ఆపదిగా
అద్దం ముందు అద్దమున్నట్లు
ఏమారక చూసుకుందాం !
షోకనిపిస్తే కాయిషుగా
పౌడర్ స్నో స్ప్రే లు – దోస్తాన మరి
అలయి బలయి !

మనిషి జన్మ ఎంత గొప్పది
ఒకరంటే ఒకరికి
ఎప్పుడూ కుశల ప్రశ్నల తాపత్రయ
అనుబంధంగా లేఖలు ఫోనులు !
క్షణం విడిచిపోతే నిరీక్షణలు !
రాకడ పోకడ – దినం గడుచుడే
పొద్దయింది తెల్వదు
రాత్రి అయింది అసలే తెల్వదు

ఈ రోజున కలిసి చౌరస్తాలో
1/4 ఛాయ్ తాగడం
డబుల్ చక్కెర కలిపినట్లు
డైరీలో రాసుకోవాల్సిన క్షణక్షణాలు
రేపు ఈ చౌరస్తా జనసంచారం లేక
చిన్నబోయి సందుగొందు గావచ్చు !
క్రిమి కీటకాల పాడు కాలం కదా !
రోడ్డు పై అన్నీ సైరన్ మోతలే

ఈ చేయికి ఎన్నెన్నో
కరచలనాలు జ్ఞాపకం ---
ఇప్పుడు ఎన్నెన్నో తప్పిపోయినై
ఈ లిప్తలు అపురూపం ఇక
నీ చిరునామ రేపు ఎక్కడో --
నా కాలం అందరిని
వెతుక్కోవడంతోనే సరికిసరి !
ఇంకా చేతికి గడియారం ఒకటి
ముండ్లన్నీ ఆగమాగం కాలం ?



- కందాళై రాఘవాచార్య
8790593638

# బహుజన కథ-పరిశీలన

**తెలంగాణలో జరిగిన పరిణామాలన్నీ కథల్లో కనపడతాయి. కథా రచయితలు ఇక్కడ జరిగిన మార్పులను, పోరాటాలను, ఉద్యమాలను, నేపథ్యంగా తీసుకొని కథలు రాశారు. అలా కథ వొక చారిత్రక వనరుగా నిలిచింది. ప్రజల సుఖ దుఃఖాలను, ప్రజలు తమ అభివృద్ధి కోసం జరిపిన ప్రయత్నపరంపరను కథ పట్టించు కొంది. భండారు అచ్చమాంబ నుండి నేటితరం రచయితల వరకు రాసిన కథలు అన్నీ కూడా ప్రజల పక్షం నిలిచాయి. తెలంగాణలో జరిగిన వికాసం మొదలుకొని నేటి ప్రపంచీకరణ సందర్భంగా జరుగుతున్న విస్తృతి వరకు, పోయిన పోకడలన్నీ కూడా కథల్లో కనపడ తాయి. విస్మృతికి గురి అయిన సమూహాలు తలెత్తుకొని, తమ అస్తిత్వ ఆకాంక్షలను ఎలుగెత్తి చాటిన విధానాన్ని కూడా కథ అక్కున చేర్చుకుంది. తెలంగాణ కథ నడిచిన దారులను పరిశీలించి, కథ ప్రజల వెతలను ఏ విధంగా పట్టించుకుందో డా॥ బి.వి.యన్.స్వామి వివరిస్తున్నారు.**

- సంపాదకులు

సామాజిక మార్పులకు ప్రాథమిక, గౌణ కారణాలుంటాయి. మార్పు వచ్చాక గౌణ కారణం కాస్తా ప్రాథమిక కారణం స్థాయికి ఎదిగి మరో మార్పుకు చోదకశక్తిగా మారుతుంది. అదే విధంగా పునాది అంశాలు, ఉపరితలాంశాలు అనే భావాలు కూడా స్థితిని మార్చుకుంటాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా కులం అనేది ఇక్కడి సామాజిక దొంతరలలో ఒకటిగా ఒదిగిపోయింది. అది చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. అలాంటి బలీయమైన శక్తిని కాదని భారత రాజకీయాలు సాగినవి. జాతీయత, భాష, మతము, వర్గం అనే విభజనలు రాజ్యాధికారాన్ని కొందరి చేతులకే పరిమితం చేసినయి. ఈ క్రమంలో అధికారాన్ని అందిపుచ్చుకొని, మొదటి వరుసలో ఉన్న అగ్రకులం వారే కొందరు. మిగిలిన వారు ద్వితీయ, తృతీయ శ్రేణి పౌరులుగా ఉండిపోయిన బహుజనులు. కాలంలో వచ్చిన మార్పుల సారాంశంగా మధ్య తరగతిగా వారు స్థిరపడ్డారు. అప్పుడే తమస్థితి గతులను బేరీజువేసుకొని గతాన్ని నెమరు వేసుకొన్నారు. వారి పట్టుదల ఫలితంగా పుట్టుక వచ్చినవే అస్తిత్వ ఉద్యమాలు.

కులము, లింగము, మతము, ప్రాంతము అనే వర్గీకరణ ఆధారంగా దళితవాద, స్త్రీవాద, మైనార్టీ వాద, ప్రాంతీయవాద ఆలోచనలు పురుడుపోసుకొని రాజకీయ అధికారం కోసం ముందడుగు వేసాయి. మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేడ్కర్, కాన్షీరాం లాంటి తాత్వికులు, సంస్కర్తలు, నాయకులు చూపిన బాటలు కొత్త సమాజాన్ని వాగ్దానం చేసాయి. 19–20 శతాబ్దాల్లో మొదలైన సంస్కరణ ఉద్యమాలు ఆధునిక కాలంలో అనేక మార్పులకు దోహదపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మార్పులు మన సమాజాన్ని ప్రభావితం చేసాయి. వీటివల్ల కింది కులాల ఐక్యతకు తొలి బీజం పడింది. వాస్తవంలో ఈ పని బౌద్ధం ఆనాడే చేసింది. బుద్ధుని బోధనలు నాటి ఎగుడు దిగుడు సమాజాన్ని ఉక్కిరి బిక్కిరి చేసాయి. అనేకులు బుద్ధుని శిష్యులుగా మారి ఆ మతం వారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తరువాతి కాలంలో సూఫీ ప్రభావం చేత హిందువులు, ఇస్లాం నీడలోకి వచ్చారు. ఈనాటి అర్థంలో వీరందరూ బహుజనులే.

బ్రిటిష్ వాళ్ళు ఇండియాలో రాజకీయ ఆర్థిక మార్పులకు కారణమయ్యారు. సంస్కృతి జోలికి మాత్రం పోలేదు. మనుషుల జీవితాలకు కట్టడి ఏర్పరచి అందులో నుండి బయటకు పోకుండా కాపలా కాసేవి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, పండగలు–పబ్బాలు, పనిముట్లు మొదలగునవి. వీటిలో చొరబడితే మనుషుల మనోభావాలు గాయపడి తిరగబడే ప్రమాదముందనే విషయం వారికి తెలుసు. నిచ్చెన మెట్ల కులవ్యవస్థకు ఇదొక రక్షణ కవచం. దీని జోలికి రాకుండా బ్రిటిష్ వారిని పై తరగతుల వారు కట్టడి చేసారు. ఆంగ్లోవెర్నాక్యులర్ విద్యావిధానం వల్ల కావచ్చు, ఇతర ప్రభావాల వల్ల కావచ్చు, బహుజనుల్లోని బి.సి. కులాల వారు ఎదిగారు. అంబేద్కర్ కృషి వల్ల దొరికిన రాజకీయ రిజర్వేషన్ల వల్ల దళిత కులాలు కూడా అడ్వాన్స్ పొజిషన్ అందుకున్నాయి. దీనివల్ల రాజకీయ అవగాహన కలిగింది. ఆ అవగాహనతోనే మైనార్టీ లయిన ముస్లింలను కూడా కలుపుకుని ముందుకు సాగడానికి బహుజన వాదం పిడికిలి బిగించింది. బహుజన హితాయ–బహుజన సుఖాయ అనే బుద్ధుడి అభిరుచి వాక్యం, ఓట్లు మావి, సీట్లు మీవా అనే నినాదాలు దిశను నిర్దేశించాయి.

సమాజంలో జరిగే పరిణామాలకు సాహిత్యం దర్పణం. సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో కథ ఒకటి. తెలంగాణ కథ కాలం పోకడలను పట్టించుకుంది. అలా అది ఒక చారిత్రక వనరుగా మిగిలింది. వర్తమానంలో బహుజన కులాల్లో వస్తున్న మార్పులను ఈ కథ చూపెట్టింది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల కుల వృత్తులు ఎలా ఛిద్రం అయ్యాయో కథ చెప్పింది. చేతివృత్తుల కళ జాతి జీవనానికి ఎలా పాదులు వేసిందో వివరించింది. మొత్తంగా బహుజన కథ మానవ శ్రమకు పట్టం కట్టింది. ఈ కథలు సమాజలోపలి పొరల్లోని మలినాన్ని బయటపెట్టాయి. దాని బాధితుల వేదనను ప్రపంచానికి అందించాయి. వారి అస్తిత్వాన్ని ఎరుక పరుస్తూ ఆత్మగౌరవాన్ని డిమాండ్ చేసాయి. రాజకీయ అధికారం ద్వారానే సాధికారత, సామాజిక న్యాయం, సామాజిక మార్పు సాధ్యమని తేల్చాయి. బహుజన చైతన్యపు ఆనవాళ్ళను అందించాయి. చమట చుక్కల ఉదాత్త వ్యక్తిత్వాలను ఆవిష్కరించాయి. శ్రామికుల స్వచ్ఛ ఆలోచనలను, అమాయక ధోరణులను పదిలపరిచాయి. ఈ కథలు బహుజన ప్రపంచాన్ని కంటిపాప వరకు తెచ్చిపెట్టాయి. సామాజిక మార్పుకు, వ్యక్తిగత చైతన్యం కూడా దోహదపడుతుందని నిర్ణయించాయి.

తెలంగాణ కథకుల్లో చాలా మంది బహుజన కథను అత్యంత శ్రద్ధతో చిత్రించారు. వీళ్ళలో చాలా మంది బహుజన కులాల వారే కావడం గమనార్హం. అయితే వీటిలో చాలా వరకు వృత్తులు కోల్పోయిన బాధను ఆవిష్కరించినవే. జీవిత చిహ్నాలుగా బహుజన బతుకులను చిత్రించినవే. పోగొట్టుకున్న జీవితాలను మరల మరల యాది జేసుకున్నవే ఎక్కువ. దానికి బదులుగా బహుజనులు గెలుచుకున్న జీవితాల్ని ప్రదర్శనకు పెట్టే కథలు రావాలి. దీని వల్ల సంస్కరణ జరిగే అవకాశం ఉంది. గ్రామీణ భారత ముఖ చిత్రం మారిపోతున్నది. ఆ మేరకు ఉత్పత్తి కులాలు, సేవాకులాలు అనే విభజన చెదిరిపోవాలి. అందుకు బహుజన దృక్పథం అవసరం. ప్రపంచీకరణ వల్ల వృత్తులు ధ్వంసమైనవి. ఆ కులాలకు చెందినవారి గెలుపోటములు కళ్ళముందే ఉన్నవి. విషాదంలో ఉన్నవారికి మానసిక స్థైరాన్ని ఇవ్వడం సాహిత్య లక్షణం. కనుక గెలిచిన జీవితాలను చిత్రించాలి. ఊళ్ళలో బెస్తవాళ్ళ జీవితం కష్టంగా మారింది. చేపల పెంపకంలో వచ్చిన కొత్త ధోరణులను, అందుకు వారు అనుసరించాల్సిన విధానాలను కథలుగా మలచాలి. కల్లుగీత కార్మికులకు "నీర"ను పాకెట్ల ద్వారా విక్రయించడం వల్ల బతుకు భరోసా ఉంటుంది. అభివృద్ధి నమూనాలు ఎవరి జీవితాలకు మేలు చేస్తున్నవో ఎరుక పరచాలి. దాని వల్ల తమ బాగోగుల గురించి ఆలోచించే చైతన్యం కలుగుతుంది. ఇందులో భాగంగా ఆధునిక విద్య ఆవశ్యకత తెలుపాలి.

కాలువ మల్లయ్య "అడవి కాచిన వెన్నెల" అనే కథలో గొల్లల జీవిత నేపథ్యం చేసుకొని గొర్రెలను ఆదాయ మార్గంగా చేసుకోవడంలో ఎన్ని ఇబ్బందులున్నయో తెలిపాడు. ఆడెపులక్ష్మీపతి "త్రిభుజపునాల్గోకోణం" కథలో కులవృత్తి కోల్పోయిన పద్మ శాలీలు ఇతర వ్యాపారాలు చేపట్టడం వల్ల కుటుంబాలు ఎలా శిథిలం అవుతున్నయో చిత్రించాడు. రామాచంద్రమౌళి ''అమ్మానాన్న'' కథలో శిథిలమైపోతున్న బీడీకార్మికుల జీవితాల్ని చూపించాడు. కల్లుగీత కార్మికుల జీవితాల్ని అనేక కోణాలలో చిత్రించిన శ్రీనివాస్‌గౌడ్ స్వయాన అదే వృత్తికి చెందినవాడు. ఇతని "మా బతుకులు" కథా సంపుటి గౌడ వృత్తి సాదకబాధకాలను తెలియజేస్తుంది. పెద్దింటి అశోక్‌కుమార్ "ఊటబాయి" కథలో ముదిరాజ్ (తెనుగోళ్ళు) కులస్తులు చెట్లను గుత్తకు తీసుకోవడం, పండ్లుఅమ్మడం సంబంధించిన పనులలోని కష్టనష్టాలను రాసారు. ముదిగంటి సుజాతారెడ్డి "పలాయనం" కథలో చాకలి వారి జీవితాన్ని ఆ వృత్తిలో స్త్రీ పురుషుల పని విభజనలోగల వివక్షను, తేడాను తెలిపారు. కులవృత్తుల జీవితాలను చిత్రించిన కథకుల్లో జాతశ్రీది ప్రత్యేక స్థానం. బహుజనులు చేస్తున్న కుల వృత్తుల పట్ల వాళు కోల్పోయిన జీవితం పట్ల వీరికి శ్రద్ధ అధికం. తన "ఆర్తారావం" కథాసంపుటిలో అనేక బహుజన కులాల వ్యథలను రికార్డు చేసారు. "వ్యక్తిగతం" కథలో గంగిరెద్దులు ఆడించే వారి జీవితాలు, "విధ్వంసం" కథలో గాడిదలు, దొమ్మరి ఆటలు ఆడేవారి జీవితాల్ని అక్షరీకరించారు. సదానందశారద రాసిన "తొక్కుడు బండ" కథలో అగ్రకులాల వారు తమ ఎదుగుదలకు బహుజనులను ఏ విధంగా మెట్లుగా చేసివాడుకుంటారో తెలిపారు. ఐతా చంద్రయ్య "గుండెచప్పుళ్ళు" "మలుపు" కథలు మంగలి వారి జీవితాల్లోని వివిధ పార్శ్వాలను ప్రదర్శనకు పెట్టాయి. పి. చంద్ రాసిన "నెత్తుటి ధార" కథలో దూదేకుల స్త్రీ చైతన్యాన్ని చిత్రించారు. దిలావర్ రాసిన "గూడుచెదిరి పోయింది" కథలో ఆధునిక టెక్నాలజీ వల్ల వడ్రంగి వృత్తిశిథిలమవుతూ చివరికి ఆ కులవృత్తి వారు ఏ విధంగా చివికి పోయారో చిత్రించాడు. రేగులపాటి కిషన్‌రావు రాసిన "బతుకులో ఎడారి" కథ బంగారు, వెండి పని చేసే కంసాలి వృత్తి కులస్తుల పేదరికాన్ని, కడగండ్లను చిత్రించింది. కె.వి.నరేందర్ రాసిన "కటికోల్లు"కథ మాంసం అమ్మి జీవించే కటిక వారి జీవితాన్ని చెబుతుంది. బి.వి.ఎన్.స్వామి "నెలపొడుపు" కథలో చేపలు కడిగి ఇచ్చే వారి వృత్తి గురించి చిత్రించారు. శిరంశెట్టి కాంతారావురాసిన "బగారా" కథ, సన్నకారు రైతులు వ్యవసాయం చేయలేక పట్నాలకు వెళ్ళి వివిధ వృత్తి పనులకు కుదిరిన తీరును చిత్రించింది. బహుజన వర్గాల్లోని సన్నకారు రైతుల గోస వర్ణనాతీతం. వీరి బాధల పల్లవులను అనేక కథలువినిపించాయి. అంబల్ల జనార్దన్ "బయలు బతుకు" కథలో ముంబయి నగరంలోని బేల్‌దారి జీవితాలను చిత్రించాడు. అంపశయ్య నవీన్ "పొరపాటు" కథలో చేయని నేరాలకు ఎరుకల వాళ్ళు ఎలా బలి అవుతారో తెలిపారు. టి. సంపత్‌కుమార్ రాసిన "చిప్ప" కథలో ప్లాస్టిక్, ఇండాలియన్, అల్యూమినియమ్ ఉత్పత్తులతో కుమ్మరి వృత్తి ఎలా ఛిద్రమైందో కనపడుతుంది. ఆయుర్వేద వైద్యులు తమ వైద్య వృత్తి ప్రాభవం కోల్పోవటం వల్ల అచేతనంగా మిగలడాన్ని బి.మురళీధర్ రాసిన ''నెమలినార'' కథ విశదపరుస్తుంది. మేరెడ్డి యాదగిరి రెడ్డి, గూడ అంజయ్య, భూపాల్, సగ్గురాజయ్య, కాసుల ప్రతాపరెడ్డి, దేవులపల్లి కృష్ణమూర్తి, బోయ జంగయ్య, పర్కపల్లి యాదగిరిమొదలగువారు బహుజన స్పృహతో కథలు రాసారు. వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీ, ప్రేమ, ఆత్మీయతను కలిగి ఉండటం వాటిని తనకు ఇష్టమైన, తన కంటే చిన్నవాడైన యువకునిపై ప్రదర్శించడం అయోధ్యారెడ్డి రాసిన "నిశ్శబ్దంచప్పుడు" కథలో కనపడుతుంది. నందిని సిధ్ధారెడ్డి "కులకశ్పి" కథలో వడ్రంగి వృత్తిలో వచ్చిన మార్పులను, ఆ మార్పుల వల్ల ఆ కులం వాళ్ళ జీవితాల్లో వచ్చిన కష్టసుఖాలను చర్చించాడు. వడ్రంగి చేసిన బొమ్మలకు గిరాకిలేనిదశ రావడం పరమదయనీయంగా ఇందులో కనిపిస్తుంది. సదానందశారద రాసిన కథల్లో బహుజనులు ఎలా అన్యాయానికి గురౌతున్నారో తెలుస్తుంది. "గొలుసు", "తులసిమొక్క" అందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి. అనిశెట్టి రజిత రాసిన "కొత్తపాట"లో చితికిన చేనేత బతుకులో పడిన స్త్రీ సంఘర్షణను ఆమెకు దొరికిన చేయూతను చిత్రించింది. సగ్గురాజయ్య రాసిన "ప్రాణదాత" కథలో చేపలు అమ్మే వారి జీవితాలను దృశ్యీకరించారు. బహుజన వాదం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను కలిపి ఉంచేది. వీరదందరి ఐక్యతను కోరుకునేది. ఈ అర్థంలో, సిద్ధాంత వెలుగులో వీరి ఐక్యత కోసం కథలు రాసిన వారిలో స్కైబాబా ఒకరు. ముస్లిం మరియు ఇతర శూద్రకులాల ఐక్యత కోసం రాసిన కథలన్నింటిని కలిపి "అలాయి బలాయి" (బహుజన కథలు) అనే కథా సంపుటిని వెలువరించాడు. ఇదిట్లా ఉంటే సమాజంలో శూద్ర కులాల నుండి ఎదిగినవారు బహుజన ఐక్యతను గండికొట్టే వారుగా మారడం కూడా కనపడుతుంది. ఈ విషయాన్ని చాటి చెప్పే కథ "సోయి".

బతుకమ్మ పండగ, బహుజనులు తీర్చిదిద్దిన రూపమని తెలిపే కథలు రావాలి. బహుజన కళాకారుల కళల్లోని విశిష్టతను, వైవిధ్యాన్ని ఆధారం చేసుకొని కథలు రావాలి. బహుజన కులాల సాంస్కృతిక విశేషాలు తెలిపే కథలు రాయాలి. దీని వల్ల తెలంగాణ సాంస్కృతిక వాతావరణం ప్రపంచానికి తెలుస్తుంది. చిన్న కులం అనే న్యూనతాభావం ఉంటే, అన్ని చోట్ల, అన్ని నిర్మాణాల్లోను వెనుకబడే అవకాశం ఉంది. వృత్తి సంబంధ భాష, మనిషి ప్రవర్తనపై వృత్తి చూపిన ప్రభావం ఆ వృత్తికే పరిమితమైన ప్రత్యేక పండగల గురించి కథల్లో తెలుపాలి. ఒక వృత్తిలో నైపుణ్యం ఉన్న వారు, ఇతర వృత్తుల్లో కూడా రాణించగలరనే నమ్మకాన్ని కథలు కల్పించాలి. నైపుణ్యతకు ఈ రోజుల్లో అధిక ప్రాధాన్యం ఉందనే వాస్తవాన్ని విడమరచి చెప్పాలి. కోల్పోయిన జీవితం, మనుషులను కృంగదీస్తుంది. ఆ బాధను, క్రమాన్ని కథల్లో రికార్డు చేయాల్సిందే, దాని వల్ల చరిత్ర నిక్షిప్తమవుతుంది. కాని ఎన్నాళ్ళు ఇలా రాయడం? బతుకు కోల్పోయిన బహుజనులు కొత్త రూపాల్లో ఎదుగుతున్నారు. ఎదగడాన్ని, ఆ బాటలో తారసడ్డ ఇబ్బందుల్ని, ఎదిగి నిలిచిన వైనాన్ని కథలు, కథలుగా చిత్రించాల్సి ఉంది. గెలుచుకున్న జీవితాల్ని, ఆ రహదారుల్ని కథకులు ప్రపంచానికి అందించాలి. అదే విధంగా బహుజనులు రాజ్యాధి కారంలో ఏ విధంగా భాగస్తులవగలరో కూడా చెప్పాలి. ఈ విధంగా బహుజనులకు భరోసానిచ్చే కథలు రావాల్సిన కాలమిది. బహుజనుల జీవితాల్లో వస్తున్న మార్పుల్ని ప్రబలంగా చిత్రించాలి. ఆత్మగౌరవంతో నిండైన చైతన్యంతోజీవించే పరిస్థితులు నెలకొనడానికి విధాన నిర్ణయాల్లో భాగస్వాములు కావాలి. దీనికి తగిన భూమికనందించే కథా సాహిత్యం రావడం ఇవాళ్టి అవసరం.

బహుజన కథ అంటే ఆయా కులాలకు చెందిన సాంస్కృతిక అంశాలు ఉండాలి. కులపరంగా మనుషులు అనుభవించిన హింస కథలో కనపడాలి. బహుజన కులస్తులు రాస్తేనే బహుజన కథ అనపడదు. రాసేది ఎవరైనా అందులో బహుజనుల ఆకాంక్షలు, అభివృద్ధి ద్యోతకం కావాలి. సమాజంలో మాటల మధ్య కులపరమైన నిందావాక్యాలు దొర్లుతున్నవి. ఇవన్ని కూడా బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవిగా ఉన్నవి. ఇలాంటి పదాలు ఎవరైనా వాడినపుడు బహుజనుల నుండి తీవ్రమైన నిరసన వస్తున్నది. రచయితలు ఇలాంటి ధోరణిని, వివక్షను ఖండిస్తూ కథలు రాయాలి. బహుజనులు అనేక రూపాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారు. పిలుపులో, పని ప్రదేశాల్లో, నిత్యవ్యవ హారాల్లో ఇలా అనేకచోట్ల అవమానాలకు గురవుతున్నారు. చాకలి మంగలి పొత్తు ఇంటికి రాదు ఇత్తు, సౌదలాల్ ఏక్ కలాల్, కుమ్మరిపురుగు, వడ్రంగి పిట్ట, సాకలి ఆడబిడ్డకోసం సన్నాసులు కొట్టు కోవడం, దొమ్మరి దానా, పిచ్చకుంట్లోడా అని అవమాన కరమైన దూషణలను బహుజనులు ఎదుర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లను కించపరిచే లాగా "బోటిపేగుల శాలోడా" లాంటి నిందా వ్యాఖ్యలు, పదాలు వింటున్నారు. ఇలాంటి సాంస్కృతిక వివక్షను పట్టి చూపే కథలను చిత్రించాలి. ఈ ధోరణిని ప్రశ్నించే సృజన చేయాలి.



-బి.వి.యన్.స్వామి
సెల్: 9247 817732

